మనస్విినిని అభినందించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక కస్తూరిబా పాఠశాలలో చదువుతున్న సామల మనస్విని ఐక్యరాజ్య సమితిలో మాట్లాడేందుకు ఎంపికవ్వడం పట్ల కురుపాం ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి అభినందించారు. ఈ మేరకు ఆదివారం విద్యార్థినిని ప్రిన్సిపల్ శ్రీరంజని చినమేరంగి క్యాంపు కార్యాలయానికి తీసుకువెళ్లారు. ఏజెన్సీ ప్రాంతం నుంచి ఐక్యరాజ్యసమితికి ఎంపికైన మనస్విని జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే, జిల్లా వైసిపి అధ్యక్షులు శత్రుచర్ల పరిషత్ రాజు అన్నారు. అనంతరం విద్యార్థిని సత్కరించి రూ.50,000 అందించారు.

మనస్వినిని అభినందిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

జిఒ 117తో ప్రభుత్వ విద్య పతనం

- వాస్తవాలకు దూరంగా సర్కారు ఆలోచన
- సుడిగుండంలో విద్యార్థులు
- మండిపడుతున్న ఉపాధ్యాయ సంఘాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిఒ 117 ప్రభుత్వ విద్యను నాశనం చేస్తుందా? ప్రయివేటు విద్యను ప్రోత్సహిస్తుందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సిన సర్కారు.. నూతన విద్యా విధానంలో భాగంగా 117 జిఒను తీసుకొచ్చి ప్రభుత్వ విద్యను పేదలకు అందకుండా చేస్తోందా? అంటే ఉపాధ్యాయ, మేధావి వర్గం నుంచి అవుననే సమాధానం వస్తోంది. ఉపాధ్యాయ సంఘాలు ఇప్పటికే 117 జిఒకు వ్యతిరేకంగా ఆందోళనబాట పట్టాయి.

సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా ప్రభుత్వాలు నిర్ణయాలు అమలు చేస్తున్నాయి. మొన్నటి వరకు ప్రాథమికోన్నత పాఠశాలలో సర్దుబాటు పేరుతో స్కూల్ అసిస్టెంట్లను హైస్కూళ్లకు పంపించారు. దీంతో స్కూల్ అసిస్టెంట్లు లేకపోవడంతోపాటు 60 మంది విద్యార్థులు ఉన్నా ఒక్క ఉపాధ్యాయుడే ఉండటంతో పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య గతేడాది కంటే తగ్గింది. సుమారు 20 వేల మంది వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన వారి సంఖ్య తగ్గిపోయింది. ఫలితంగా ప్రయివేటు స్కూళ్లలో చేరిన వారి సంఖ్య పెరిగింది. దీంతో 60 మందిలోపు, కిలోమీటర్ దూరం ఉన్న పాఠశాలలను మూసేయడం, విలీనం చేయడం వంటి చర్యలు చేపట్టారు. ఫలితంగా చాలా వరకు స్కూళ్లు మూతపడ్డాయి. ఉపాధ్యాయ పోస్టులు లేకుండా పోయాయి. దీంతో ప్రాథమిక విద్యను సర్వ నాశనం చేసేందుకు తోడ్పడిన జిఒ మరలా ఇప్పుడు హైస్కూల్ విద్యను నాశనం చేసేలా తయారైంది. మళ్లీ సర్దుబాటు ప్రక్రియ చేపట్టారు. కొద్దిరోజులుగా సర్ప్లస్ పేరుతో ఉన్న స్కూల్ అసిస్టెంట్లను మళ్లీ ప్రాథమికోన్నత పాఠశాలలకు సర్దుబాటు చేసే ప్రక్రియ చేపట్టారు. ఇది విద్యార్థుల సంఖ్య ఆధారంగా కాకుండా సెక్షన్ల ఆధారంగా చేయడంతో హైస్కూళ్లలో ఉపాధ్యాయుల సంఖ్య తగ్గిపోనుంది. దీంతో నాడు ప్రాథమిక పాఠశాలలను నాశనం చేసిన విధానం నేడు హైస్కూళ్లకు అమలు చేస్తుండటం వల్ల అంతిమంగా విద్యార్థులు నష్టపోతున్నారు.

ప్రాథమిక విద్య స్థానిక భాషలో జరగాలి. అదే విధంగా ప్రాథమిక విద్య డైట్ ఉపాధ్యాయులు ద్వారా బోధించాలని సుప్రీంకోర్టు తీర్పు కూడా ఇచ్చింది. అలా కాకుండా బలవంతంగా ప్రాథమిక విద్యలోనే ఆంగ్ల మాధ్యమం అమలు, ప్రాథమిక విద్యా బోధన స్కూల్ అసిస్టెంట్లతో చేయించడం రాజ్యాంగ విరుద్ధం. పేద, సామాన్య విద్యార్థులకు రాజ్యాంగం కల్పించిన ఉచిత విద్యను రాష్ట్ర ప్రభుత్వం చాపకింద నీరులా అందకుండా ప్రయత్నం చేస్తుంది. మరో వైపు భవిష్యత్తులో ఉపాధ్యాయ పోస్టులు భర్తీకి కూడా అవకాశం లేకుండా ప్రభుత్వం నిర్ణయం, జిఒ 117 తోడ్పడతాయి. దీంతో ఉపాధ్యాయ సంఘాల దీనిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ విధానాన్ని అడ్డుకోకుంటే భవిష్యత్తు తరాలకు ప్రభుత్వ విద్య అందని ద్రాక్షగా తయారు కావడం ఖాయంగా కనిపిస్తోంది.

జిఒ 117తో ప్రభుత్వ విద్య సంక్షోభం

జిఒ 117వల్ల ప్రభుత్వ విద్య సంక్షోభంలో కూరుకుపోతుంది. దీనివల్ల పేద విద్యార్థులు విద్యకు దూరమవుతారు. ఇప్పటికే డ్రాపౌట్స్ సంఖ్య పెరిగింది. భవిష్యత్తులో మరింత పెరిగే ప్రమాదం ఉంది. ఈ జీవో రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. సుప్రీం కోర్టు తీర్పునకు వ్యతిరేకంగా ప్రభుత్వం విద్యా విధానాన్ని అమలు చేస్తోంది. దీని వల్ల ప్రభుత్వ విద్య పతనం ఖాయం. ఈ విధానాన్ని వెంటనే ప్రభుత్వం మానుకోవాలి. లేకుంటే భవిష్యత్తులో పెద్దఎత్తున పోరాటాలు చేస్తాం. ప్రతి గ్రామంలో పాఠశాల తప్పనిసరిగా ఉండాలి.

– ఎస్.మురళీమోహనరావు,
యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు

హైస్కూల్ విద్య సర్వ నాశనం

జిఒ 117 ద్వారా ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ ప్రాథమిక విద్యను, హై స్కూల్ విద్యను సర్వ నాశనం చేయడానికి తప్ప మరొకటి కాదు. సెక్షన్ల ఆధారంగా ఉపాధ్యాయ పోస్టులు కుదించేస్తే నాణ్యమైన విద్య ఎలా సాధ్యం?. వెంటనే జిఒ 117ను రద్దు చేయాలి.

– సన్యాసిరాజు,
ప్రధానోపాధ్యాయుల సంఘం సంఘం జిల్లా కార్యదర్శి

25న జిల్లాకు సిఎం జగన్

గిరిజన విశ్వవిద్యాలయానికి శంకుస్థాపన ఏర్పాట్లపై సమీక్షించిన రాజన్నదొర, బొత్స

ప్రజాశక్తి-విజయనగరం

ఈ నెల 25న కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయానికి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి శంకుస్థాపన చేస్తారని విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర విద్యాశాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కూడా పాల్గొంటారని తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై విద్యాశాఖా మంత్రి, ఉప ముఖ్యమంత్రి మంత్రి రాజన్నదొర, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పి దీపికతో కలిసి అన్ని శాఖల అధికారులతో ఆదివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో సమావేశం ఏర్పాటు చేశారు. సిఎం పర్యటన ఏర్పాట్లపై మంత్రి బొత్స తగు సూచనలు చేశారు. తక్కువ సమయం ఉన్నందున అధికారులంతా సమన్వయంతో పని చేయాలన్నారు. వర్షం పడే అవకాశం ఉన్నందున అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కార్యక్రమానికి మరడాం వద్ద హెలిపాడ్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ల్యాండ్ లెవెలింగ్, డెకరేషన్, సీటింగ్ ఏర్పాట్లు, తాగునీరు, పారిశుధ్యం ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు, ఎమ్మెల్యేలు బొత్స అప్పలనరసయ్య, శంబంగి వెంకట చినప్పల నాయుడు, జెసి మయూర్ అశోక్, డిఆర్ఒ గణపతిరావు, ట్రైబల్ యూనివర్సిటీ డీన్ మిశ్రా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సభాస్థలిని పరిశీలిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర, జెడ్పి చైర్మన్ మజ్జి

సభాస్థలి పరిశీలన

దత్తిరాజేరు : కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ శంకుస్థాపనకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని, ఎలాంటి లోపాలూ లేకుండా జాగ్రత్తలు తీసుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అధికారులను ఆదేశించారు. సిఎం శంకుస్థాపన చేయనున్న కుంటినవలసలోని ప్రాంతాన్ని జెడ్పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, బొబ్బిలి, గజపతినగరం ఎమ్మెల్యేలు చినప్పలనాయుడు, అప్పలనరసయ్య, గిరిజన యూనివర్సిటీ విసి కట్టమణి, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్‌పి దీపికతో కలిసి ఆదివారం ఆయన పరిశీలించారు. అధికారులకు, సిబ్బందికి ఏర్పాట్లపై తగిన సూచనలు చేశారు. శంకుస్థాపన ప్రాంతానికి వెళ్ళే రహదారి విస్తరణ చేయాలని, వాహనాల పార్కింగ్ స్థలం చదును చేయాలని సూచించారు.

కార్యక్రమంలో ఆర్‌డిఒ శేషశైలజ, డిఎస్‌పి శ్రీధర్, సిఐలు అప్పలనాయుడు, విజయనాథ్, ఆర్అండ్‌బి డిఇ శ్రీనివాసరావు, ఎంపిపి గేదెల సింహాద్రి అప్పలనాయుడు, వైస్ ఎంపిపిలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, దత్తిరాజేరు, మెంటాడ తహశీల్దార్లు బి.గురుమూర్తి, రామకృష్ణ పాల్గొన్నారు.

సంఘ రాష్ట్ర సమావేశానికి వెళ్తున్న ఎపిఎన్‌జిఒ నాయకులు, ఉద్యోగులు

ఎపి ఎన్‌జిఒ సమావేశానికి తరలివెళ్లిన నేతలు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో సోమ, మంగళవారాల్లో జరగనున్న 21వ రాష్ట్ర ఎపి ఎన్జీఓ సమావేశాల్లో పాల్గొనేందుకు రెండు బస్సుల్లో జిల్లా నుండి ఎన్‌జిఒ సంఘం నాయకులు, ఉద్యోగులు బయలు దేరి వెళ్లారు. రాష్ట్రస్థాయిలో జరిగే ఈ సమావేశాలకు ఎన్‌జిఒ సంఘాల నాయకులు, పెన్షనర్ సంఘాల నాయకులు, మెడికల్, ఇరిగేషన్, పంచాయతీ రాజ్, సచివాలయం ఉద్యోగులు వెళ్లారు. గత రెండు నెలలుగా కసరత్తులు చేసి నేడు తామంతా కలిసి వెళుతున్నట్లు ఎపి ఎన్జీఓ అసోసియేషన్ అధ్యక్షులు జివిఆర్ఎస్ కిషోర్ తెలిపారు. రాష్ట్ర ఎపి ఎన్‌జిఒ సంఘం అధ్యక్షులు బండి శ్రీనివాసరావు అధ్యక్షతన జరగనున్న సమావేశంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగ్మోహన్‌రెడ్డి హాజరు కానున్నారని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి, మండలాల నుంచి, సచివాలయాల నుండి పెద్ద ఎత్తున ఉద్యోగులు బయలుదేరారని చెప్పారు. ఈ సమావేశాల్లో రాష్ట్ర మంత్రులు బొత్స సత్యనారాయణ, బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, ఆదిమూలం సురేష్, రాష్ట్ర సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి హాజరు కానున్నారని తెలిపారు. ఈ సమావేశంలో ఉద్యోగులకు ముఖ్యమంత్రి తీపి కబురును ప్రకటిస్తారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

పెరిగిన ధరలతో వార్డెన్లకు మెనూ కష్టాలు

- ఏడాదిగా పెండింగ్‌లో బిల్లులు
- అప్పుల ఊబిలో వసతిగృహ సంక్షేమాధికారులు

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో మెనూ అమలుకు వార్డెన్లు అవస్థలు పడుతున్నారు. అమాంతంగా పెరిగిన కూరగాయలతో మెనూ ప్రకారం ఎలా వండి వడ్డించాలి రా.. దేవుడా.. అంటూ తలలు పట్టుకుంటున్నారు. ప్రభుత్వం నుండి గిరిజన సంక్షేమ వసతి గృహాలకు ఎప్పుడు బిల్లులు వస్తాయో తెలీని పరిస్థితి. దీంతో తలకుమించి అప్పులు చేసి మరీ వసతి గృహాల్లో మెనూ ప్రకారం విద్యార్థులకు వంట చేయాల్సిన పరిస్థితి నెలకొందని వార్డెన్లు వాపోతున్నారు.

మార్కెట్లో కూరగాలయ ధరలు ఇలా :

మార్కెట్లో టమోటా, పచ్చిమిర్చి, బీన్స్ కిలో వంద రూపాయలకు అమ్ముడు పోతున్నాయి. క్యారెట్, చిక్కుడు, బీర, బెండకాయ. సొరకాయ, ఇతర రకాలు కిలో రూ.60 పైనే. కంది పప్పు, పెసర పప్పు కలిపి సాంబరు చేయాలి. ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాల్లో ఏర్పాటు చేసిన మెనూ పట్టిక ప్రకారం ఆహారం పెడితే ప్రభుత్వం ఇచ్చే మెస్ చార్జీలు చాలక వార్డున్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2018, 2023లో మెనూ ఛార్జీలు పెంచింది. ప్రస్తుతం నిత్యావసర వస్తువులతో పాటు కూరగాయల ధరలు పెరగడంతో మెనూ ప్రకారం భోజనాలు పెట్టడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వార్డెన్లు చెబుతున్నారు. గత ఏడాది సెప్టెంబర్ నుండి 2023 జూలై వరకు బిల్లులు పెండింగ్ ఉన్నాయని, దీంతో కూరగాయల దుకాణదారులు, సామాన్లు అరువులు ఇవ్వకపోవటంతో గత్యంతరం లేక అప్పులు తెచ్చి పెట్టాల్సి వస్తుందని వార్డెన్లు వాపోతున్నారు. పై అధికారులు, ప్రభుత్వ స్పందించి సక్రమంగా బిల్లులు ఏ నెలకు ఆనెల మంజూరైనట్లు చూడాలని కోరుతున్నారు.

మెనూ ఇలా

2023 – 24 విద్యాసంవత్సరానికి సంబంధించి పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఆహార పట్టికను రూపొందించి అమలు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పాఠశాల వసతిగృహాల్లో వారంలో ఆదివారం బిర్యాని, మూడు రోజులు చికెన్‌తోపాటు ఆరు కోడిగుడ్లు, అరటి పండ్లు, ఉదయం అల్పాహారంలో విద్యార్థులకు పాలు ఇవ్వాల్సి ఉంది. వాటితో పాటు వేరుశనగ చెక్కి, ఉడికించిన శనగలు, రాగిలడ్డు, రవ్వ పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సంక్షేమ వసతి గృహాల్లో పట్టిక ఏర్పాటు చేశారు. కళాశాల విద్యార్థులకు వారంలో రెండు రోజులు చికెన్, ఆరు కోడిగుడ్లు, అరటిపండ్లు ఇవ్వాలి, వాటితో పాటు పాఠశాలల మాదిరిగానే కూరగాయలతో వంటలు చేయాల్సి ఉంది. అయితే డైట్ ఛార్జీలు మాత్రం అంతగా లేవు.

డైట్ చార్జీలు ఇలా

ప్రభుత్వం సంక్షేమ గృహాలిచ్చే డైట్ ఛార్జీలు.. మూడు, నాలుగు తరగతులకు గతంలో వెయ్యి రూపాయలుగా ఉంటే ప్రస్తుతం రూ.1,150, ఐదు నుండి పదో తరగతి వరకు ఉన్న విద్యార్థులకు గతంలో రూ.1,200 ప్రస్తుతం రూ. 1,400, ఇంటర్‌పై విద్యార్థులకు రూ.1,400 నుంచి రూ. 1,600లు ప్రభుత్వం ప్రస్తుత మార్కెట్లో కూరగాయలు, ఇతర నిత్యావసర వస్తువుల ధరలు అమాంతంగా పెరిగిపోవడంతో సంక్షేమ వసతిగృహం నిర్వాహకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెరిగిన కూరగాయల ధరలతో ఇబ్బంది పడుతున్నా సాధ్యమైనంత వరకు మార్కెట్ల నుంచి కూరగాయలు కొనుగోలు చేస్తున్నట్లు చెబుతున్నారు. ప్రభుత్వం మెనూ ఛార్జీలు పెంచడంతో పాటు బిల్లులు సక్రమంగా చెల్లించాలని కోరుతున్నారు.

భిక్షాటన చేస్తూ నిరాహార దీక్షలు చేస్తున్న సాధన కమిటీ సభ్యులు

నాలుగో రోజుకు రిలే నిరాహార దీక్ష

పోరాటానికి పెరుగుతున్న మద్దతు

ప్రజాశక్తి - కొమరాడ

పుర్ణపాడు – లాబేసు వంతెన నిర్మాణం పూర్తి చేయాలని కోరుతూ సాధన కమిటీ ఆధ్వర్యంలో బిక్షాటన చేస్తూ నాలుగవ రోజు రిలే నిరాహార ఆదివారం చేపట్టారు. పూర్ణపాడు – లాబేసు వంతెన పెండింగ్ పనులను పూర్తి చేయాలని సాధన కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలకు అరకు పార్లమెంటు బిసి సెల్ అధికార ప్రతినిధి ద్వారపూడి సత్యనారాయణ, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కోలక అవినాష్, సహాయ కార్యదర్శి పువ్వల తిరుపతిరావు మద్దతు తెలిపారు. అనంతరం వీరు మాట్లాడుతూ ఇప్పటికైనా మన పాలకులు ఇచ్చిన మాట ప్రకారం వెంటనే కాంట్రాక్టర్‌ను రప్పించి వంతెన పనులు పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారమయ్యేంత వరకూ ఈనెల 26 వరకు జరుగుతున్న రిలే నిరార దీక్షలను, 28న తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సాధన కమిటీ సభ్యులు వాకాడ ఇందిర, కొల్లి సాంబమూర్తి, బత్తిలి శ్రీనివాసరావు, పాలక నూకరాజు, హెచ్.రామారావు, శివున్నాయుడు, వెంకటేశు, అప్పారావు, పోలినాయుడు, గౌరీ, గణపతి, సింహాచలం, మాణిక్యం, రాజేశ్వరి, లక్ష్మమ్మ, పార్వతి, అప్పారావు పాల్గొన్నారు.

ప్రవీణ్‌ప్రకాశ్ వైఖరి మార్చుకోవాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - కలెక్టరేట్

విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్ అహంకార పూరిత వైఖరిని మార్చు కోవాలని యుటిఎఫ్ మధ్యంతర కౌన్సిల్ సమావేశం డిమాండ్ చేసింది. ఈ కౌన్సిల్ సమావేశాన్ని ఉద్దేశించి రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన రావు మాట్లాడుతూ 'నేను ఐఎఎస్‌ను..మిమ్మల్ని ఏమైనా చేయగలను' అని ఉపాధ్యాయులను ఉద్దేశించి ప్రవీణ్ ప్రకాశ్ అన్నారంటే ఆయనకు ముఖ్యమంత్రి జగన్ కాపుకాస్తున్నట్లు ఉపాధ్యాయ లోకమంతా అనుకుంటుందన్నారు. ఒకవేళ కాపు కాయక పోతే ప్రవీణ్‌ప్రకాశ్‌ను వెంటనే విద్యాశాఖ కార్యదర్శి నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జగన్‌కు లక్షా 50వేల మంది ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు కావాలో, ప్రవీణ్ ప్రకాశ్ కావాలో తెల్చుకోవాలని అన్నారు. జిల్లా అధ్యక్షులు టి.రమేష్ మాట్లాడుతూ ఈనెల 23న అమరావతిలో జరిగే 12 గంటల ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు కె.విజయ్‌కుమార్, కోశాధికారి మురళి, రాష్ట్ర కౌన్సిలర్లు డి.ప్రకాష్, పి.మధు, పిబి రాయుడు, రోజరమణి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

సిఆర్‌టిల సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు మురళీమోహనరావు

సిఆర్‌టిలను రెగ్యులర్ చేయాలి

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయుల అందర్నీ రెగ్యులర్ చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో సిఆర్‌టిల సంఘ సమావేశం జరిగింది. ఈసందర్భంగా మురళీమోహన్ మాట్లాడుతూ ప్రస్తుతం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సిఆర్‌టిలను రెగ్యులర్ చేయాలని, ఇది వరకు ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల మేనిఫెస్టోను అమలు చేయాలని కోరారు. సిఆర్‌టిలను రెగ్యులర్ చేయాలని కోరుతూ ఈనెల 25న డిఇఒ కార్యాలయం నుండి కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించి, అనంతరం కలెక్టర్‌కు వినతిని అందజేయనున్నట్టు తెలిపారు. సమావేశంలో సిఆర్‌టి నాయకులు. కొమ్ము మురళీకృష్ణ, డప్పుకోట ప్రశాంత కుమార్, ఆరిక వెంకటరావు, నాగం దొర హాజరయ్యారు.

పాలకుల నిర్లక్ష్యం వల్లే నిలిచిన 'పెదంకలాం' పనులు

ప్రజాశక్తి - బలిజిపేట

పాలకుల నిర్లక్ష్యం వల్లే బలిజిపేట, వంగర మండలాల్లోని 8,270 ఎకరాలకు సాగునీరందించే పెదంకలాం ప్రధాన పనులు ముందుకు సాగడంలేదని మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు విమర్శించారు. మండలంలోని పెదపెంకిలో ఆదివారం టిడిపి మండల అధ్యక్షులు పెంకి వేణుగోపాలనాయుడు అధ్యక్షతన టిడిపి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో చిరంజీవులు మాట్లాడుతూ కాలువ ఆధునీకరణకు మంజూరైన రూ.13కోట్ల జైకా నిధులు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఈ నిధులు ఖర్చు చేయకపోవడంతో ఎక్కడిక్కడ పూడికలు పేరుకుపోయి సాగునీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్నాయన్నారు. దీంతో 25కిలోమీటర్ల దూరం రావాల్సిన సాగునీరు 9కిలోమీటర్లకైనా రావడంలేదన్నారు. అలాగే అంపావల్లి పైలెట్ ప్రాజెక్టు పరిధిలో 11 గ్రామాలకు ఎంతో కాలం తాగునీరు సక్రమంగా సరఫరా కావడంలేదన్నారు. పాలకులు ఈపథకం గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. పెదపెంకిలో ఫైలేరియా వ్యాధిగ్రస్తులు 58మంది ఉన్నట్టు ఇప్పటి ఐటిడిఎ పిఒ లక్ష్మీషా నిర్ధారించగా, వీరికి నేటికీ పింఛన్లు మంజూరు చేయకపోవడం దారుణమన్నారు. వంతరాంలోని కెజిబివిలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో టిడిపి నాయకులు పెంకి రామ్మోహన నాయుడు, ప్రసాదరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతికి భంగం కలిగించడం వల్లే

పులుల భయం

- అనుకూలమైన స్థావరం దొరికే వరకూ సంచరిస్తూనే ఉంటుంది
- స్థిరమైన స్థావరానికి 15 నుంచి 20 కిలోమీటర్ల గిరిశిఖరం అవసరం
- సురక్షితంగా బంధించేందుకు ప్రయత్నిస్తున్నాం
- ఈలోపు ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిందే
- ప్రజాశక్తితో డిఎఫ్‌ఒ జిఎపి ప్రసూన ముఖాముఖి



ప్రకృతికి భంగం కలగడం వల్లే పులులు, ఏనుగుల నుంచి ప్రమాదాన్ని చవిచూడాల్సి వస్తోందని మన్యం జిల్లా అటవీశాఖ అధికారి, విజయనగరం జిల్లా ఇన్‌ఛార్జి డిఎఫ్‌ఒ జిఎపి ప్రసూన తెలిపారు. సహజ సిద్ధమైన అడవుల్లో మానవాళి కదలికలు ఎక్కువైనప్పుడు, అక్కడ నివశిస్తున్న జంతువులు ఇతర ప్రాంతాల్లోకి దిశమార్చుకుంటాయని వివరించారు. ప్రస్తుతం పులి పాలకొండ, భామిని ఏజెన్సీలోనూ, ఏనుగులు కొమరాడ ప్రాంతంలోనూ సంచరిస్తున్నాయని వెల్లడించారు. వాటి బారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా పులి బొండపల్లి మండలం వెదురువాడ పంచాయతీ పనసలపాడు వద్ద ఉన్న దట్టమైన అటవీ ప్రాంతంలో మినహా ఎక్కడ స్థిరంగా ఉండడం లేదన్నారు. అనుకూలమైన స్థావరం దొరికే వరకూ పులి సంచరిస్తూనే ఉంటుందని వివరించారు. అప్పటి వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండడమే ఏకైక మార్గమన్నారు. విజయనగరం, మన్యం జిల్లాల్లో సంచరిస్తున్నది పెద్దపులిగానే పరిగణిస్తున్నామని స్పష్టంచేశారు. ఈ వారంత తనను కలిసిన ప్రజాశక్తికి డిఎఫ్‌ఒ ప్రసూన ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

– ప్రజాశక్తి, విజయనగరం ప్రతినిధి

? పులి ఎక్కడి నుంచి? ఎందుకు వచ్చినట్టు?.

పులి ఎక్కడి నుంచి వచ్చిందో స్పష్టంగా చెప్పలేం. ఎందుకంటే పాపికొండల్లో మినహా శ్రీకాకుళం, పార్వతీపురం, పాడేరు ఏజెన్సీల్లో పులులు ఉన్నట్టు మా రికార్డుల్లో కూడా లేదు. పులి స్థావరం ఉన్న ప్రాంతంలోకి జనాలు ప్రవేశించినప్పుడు లేదా పెద్దపెద్ద శబ్దాలు, మంటలు వంటివి ఏర్పడినప్పుడు పులులు వాటి స్థావరాన్ని మార్చుకుంటాయి. అటువంటి సందర్భాల్లో అనుకూలమైన స్థావరం దొరికే వరకూ సంచరిస్తూనే ఉంటాయి. పాపికొండలు లేదా ఒడిశా, చత్తీస్‌గడ్ అటవీ ప్రాంతం నుంచి వచ్చి ఉండవచ్చు. సాధారణంగా మైనింగ్, రోడ్ల నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టినప్పుడు అవి తమ దిశ మార్చుకుంటాయి.

? ప్రస్తుతం పులి ఎక్కడ ఉంది?.

ప్రస్తుతం మన్యం జిల్లా పాలకొండ, భామిని ఏజెన్సీలో సంచరిస్తున్నట్టుగా ఆనవాళ్లు ఉన్నాయి. ఈ నేపథ్యంలో భామిని మండలంలోని 52 గ్రామాల ప్రజానీకాన్ని అప్రమత్తం చేశాం. సాయంత్రం, తెల్లవారుజామున ఇళ్ల నుంచి బయటకు వెళ్లవద్దని ప్రచారం చేపట్టాం.

? మన ప్రాంతంలో సంచరిస్తున్నది చిరుతా? పెద్ద పులా?.

మన ప్రాంతంలో సంచరిస్తున్నది పెద్ద పులి. చిరుత కానే కాదు. పులిసైజును బట్టి ఆడ, మగ అనేది గుర్తిస్తాం. రంగులను బట్టి పెద్దపులా? చిరుత అనేది గుర్తించవచ్చు. పెద్ద పులి చర్మంపై చారులు కనిపిస్తాయి. అదే చిరుత అయితే చుక్కలు ఉంటాయి. చారులు కనిపిస్తున్నాయి కాబట్టి పెద్ద పులిగా భావించవచ్చు. దీన్ని సిసి కెమెరాల ఆధారంగా గుర్తించాం.

? పులి అనుకూల స్థావరాలు ఎలా ఉంటాయి?.

సాధారణంగా పులులు గిరిశిఖర గ్రామాల్లో స్థావరాన్ని ఏర్పాటు చేసుకుంటాయి. కనీసం 15 నుంచి 20 కిలోమీటర్ల విస్తీర్ణంలో సంచరిస్తుంది. ఆయా పరిసర ప్రాంతంలో మరో పులి ఉండేందుకు కూడా అవకాశం లేదు. ఎందుకంటే పిల్లలతో ఉన్న పులులు మినహా ఆడైనా, మగైనా అన్నీ ఒంటరిగానే ఉంటాయి.

? పులి ఎన్నిచోట్ల దాడికి పాల్పడింది?.

పులి సంచరిస్తున్న ప్రతి ప్రాంతంలోనూ దాడికి ప్రయత్నించింది. గత ఏడాది సెప్టెంబర్ నుంచి ఇప్పటి వరకు పార్వతీపురం మన్యం జిల్లాలో నాలుగు చోట్ల, విజయనగరం జిల్లాలో నాలుగు చోట్ల పశువులు, మేకలు, గొర్రెలపై దాడికి పాల్పడింది.

? పులిని బంధించి, వాటికి అనుకూలమైన ప్రదేశానికి తరలించే ఏర్పాట్లు చేస్తున్నారా?.

వన్యప్రాణుల సంరక్షణ చట్టం ప్రకారం పులిని సురక్షితంగా బంధించి, స్థావరానికి అనుకూలంగా ఉండే అటవీ ప్రాంతానికి తరలించే ఆలోచనలోనే ఉన్నాం. అందుకనుగుణంగా ఆపరేషన్ చేపట్టాం. ఇంకా కొనసాగుతోంది. ఇప్పటికే మెంటాడ, గంట్యాడ, బొండపల్లి, దత్తిరాజేరు, పాలకొండ సహా పులి సంచరించినట్టు ఆనవాళ్లున్న అన్ని ప్రాంతాల్లోనూ ఆపరేషన్ చేపడుతున్నాం. ముఖ్యంగా బొండపల్లి మండలం వెదురవాడ పంచాయతీ పనసలపాడు వద్ద గల దట్టమైన అటవీ ప్రాంతంలో వద్ద ఎక్కువ రోజులు ఉన్నట్టుగా గుర్తించి, అక్కడ ప్రత్యేక ట్రాక్ కేజ్ ఏర్పాటు చేసి బంధించేందుకు తీవ్రంగా ప్రయత్నించాం. కానీ, అది తెలివిగా తప్పించుకుంటోంది. మా వంతు ప్రయత్నం చేస్తున్నాం.

ప్రజాశక్తి
www.prajasakti.com

సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి దామోదరరావు

ఆశాజ్యోతి ఆశ్రమంలో న్యాయ అవగాహన సదస్సు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

జిల్లా కేంద్రంలో గల ఆశాజ్యోతి చారిటబుల్ ట్రస్టు కార్యాలయంలో జిల్లా న్యాయమూర్తి ఎస్.దామోదరరావు ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు ఆదివారం జరిగింది. ఈ సదస్సులో జిల్లా జడ్జి బాలల చట్టపరమైన హక్కుల గురించి వివరించారు. సీనియర్ సివిల్ జడ్జి జి.యజ్ఞనారాయణ బాలకార్మిక వ్యవస్థకు సంబంధించిన చట్టాలపై మాట్లాడారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.రమేష్ ప్రజలకు సంబంధించిన అనేక చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటరావు, రెడ్‌క్రాస్ చైర్మన్ మంచిపల్లి శ్రీరాములు, ఆశాజ్యోతి ఆశ్రమం ముఖ్య సలహాదారులు బడే నాగభూషణరావు, చెరుకూరు. జగదీశ్వరరావు, పెంటపాటి సాయి పాల్గొన్నారు.

అత్యవసర విభాగాలను పరిశీలించిన డిఐఒ

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

స్థానిక జిల్లా ఆసుపత్రిలో పోషకాహార పునరావాస కేంద్రం (ఎన్ఆర్‌సి), నవజాత శిశువుల అత్యవసర విభాగాలను (ఎస్ఎన్‌సియు) జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు ఆదివారం సందర్శించారు. ముందుగా ఎన్ఆర్‌సిలో చిన్నారుల ఆరోగ్యం పరిశీలించి, వారికి అందిస్తున్న చికిత్స, పోషకాహార మెనూ రికార్డులను పరిశీలించారు. పిల్లలు చేరినప్పుడు ఆరోగ్య స్థితి, ప్రస్తుతం ఏ మేరకు ఆరోగ్యం వృద్ధి చెందినది పరిశీలించారు. అనంతరం కేంద్రాల నిర్వహణపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఎన్నికల ఫలితాలు ప్రభుత్వ వ్యతిరేకతకు నిదర్శనం

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

స్థానిక సంస్థల సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు రాష్ట్రంలో ప్రభుత్వ వ్యతిరేకతకు అద్దం పడుతున్నాయని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి జగదీష్ అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో మాట్లాడుతూ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైసిపి అధికారం కోల్పోయే పరిస్థితిలో ఉందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో ప్రజా ప్రయోజనాలను పట్టించుకోకుండా అభివృద్ధిని అటకెక్కించారని విమర్శించారు. అలాగే సంక్షేమ పథకాల పేరిట ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు తీవ్ర నష్టం కలిగించారని అన్నారు. విలేకరుల సమావేశంలో పట్టణ, మండల టిడిపి అధ్యక్షులు జి.రవికుమార్, డి.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్నఎమ్మెల్యే కళావతి

సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి - పాలకొండ

నగర పంచాయితీ పరిధి బల్లంకి వీధికి చెందిన గొర్లె సురేష్ కుమారుడు అనారోగ్యంతో బాధపడుతున్నందున, వైద్యం అయిన ఖర్చు నిమిత్తం గొర్లె సురేష్ పేరున ముఖ్యమంత్రి వారి సహాయ నిధి నుండి మంజూరైన మొత్తం రూ.60వేలు చెక్కును, ఆదివారం స్థానిక ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి వండువలో గల తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

సీనియర్ నాయకుడు మృతికి టిడిపి సంతాపం

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మండలంలోని లక్ష్మీనారాయణపురానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు పార్టీకి ఎనలేని సేవలు అందించిన విశ్రాంత ఉపాధ్యాయులు అల్లు అప్పలనాయుడు మరణించిన సందర్భంగా ఆదివారం పార్వతీపురం నియోజకవర్గ టిడిపి నాయకులు సంతాపాన్ని ప్రకటించారు. ఆదివారం ఆయన అంత్యక్రియలకు హాజరై పాడే మోస్తూ నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు ద్వారపురెడ్డి జగదీశ్, బొబ్బిలి చిరంజీవులు, మండల పార్టీ అధ్యక్షులు దొగ్గ మోహనరావు, ఎఎంసి మాజీ చైర్మన్ రెడ్డి శ్రీనివాసరావు, తెర్లి రవికుమార్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రాన్ని అందుకుంటున్న గడ్డియ్య

ఆర్‌పిఐ జిల్లా అధ్యక్షులుగా గడ్డియ్య

ప్రజాశక్తి - సీతంపేట

రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్ పార్టీ) జిల్లా అధ్యక్షులుగా గొర్లె గడ్డియ్య ఎన్నికయ్యారు. విశాఖపట్నంలోని అంబేద్కర్ భవన్లో ఆదివారం రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయను ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జాతీయ ఉపాధ్యక్షులు బొడ్డు కళ్యాణ్‌రావు, ఉత్తరాంధ్ర కన్వీనర్ కె.గణపతికి గడ్డియ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. .

తప్పుడు ఆరోపణలు మానుకోవాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కురుపాం మండలం గుమ్మ పంచాయతీ సర్పంచ్ ఉప ఎన్నికలో టిడిపి రెబల్ అభ్యర్థిని పెట్టామని నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వరి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని రెండో గ్రూపునకు చెందిన టిడిపి సీనియర్ నాయకులు రమణమూర్తి, సోనాలి రామారావు అన్నారు. అభ్యర్థి ఓటమితోనే తమ గ్రూపుపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, ఇందులో వాస్తవం లేదన్నారు. టిడిపి అభ్యర్థి నామినేషన్ వేసేటప్పుడు రెండు గ్రూపులను కలపాలన్న ఆలోచన పరిశీలకుడు చేయకపోవడం విచారకరమన్నారు. రెండు గ్రూపులు ఐక్యంగా ఉంటే టిడిపి అభ్యర్థి భారీ మెజార్టీతో గెలిచేవారని అన్నారు.

పలు గ్రామాల్లో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని గెడ్డలుప్పి, జోగింపేటలో పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఇఒపిఆర్‌డి కెకె వర్మ మాట్లాడుతూ పలు గ్రామాల్లో పారిశుధ్యం, మంచినీటి సమస్యల్లేకుండా చూడాలని కార్యదర్శులకు, సర్పంచులకు తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో డ్రైనేజీ బాగు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామ సర్పంచులు అల్లు తిరుపతి నాయుడు, కళ్లెంపూడి సింహాచలం, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

గిరిజన మహిళలకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మండలంలోని డోకిశీలలో ఆదివారం జరిగిన ఒక కార్యక్రమంలో పార్వతీపురం పట్టణ పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కె.కృష్ణమూర్తి గిరిజన మహిళలకు చీరలు, స్టీల్ గ్లాసులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బొమ్మి రమేష్, కిమ్మి చిరంజీవి, సర్వేపల్లి అప్పారావు పాల్గొన్నారు.

పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న హెచ్‌సి కృష్ణమూర్తి

దోమల నివారణపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి - సాలూరు

దోమల నివారణపై పట్టణ ప్రజలు అవగాహన పెంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎం.ఈశ్వరరావు కోరారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ఆదివారం పట్టణంలో మున్సిపల్ శానిటేషన్ అధికారి కెవి ఫకీర్‌రాజు, మలేరియా సబ్ యూనిట్ అధికారి ఈశ్వరరావు ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మలేరియా అనేది ఆడఅనాఫిలస్ దోమ కాటు వల్ల వస్తుందని 1897 ఆగష్టు 20న సర్ రోనాల్డ్ రాస్ కనుగొన్నారని చెప్పారు. ఆ రోజు ఏటా మలేరియా దినోత్సవం జరుపుకుంటారని తెలిపారు. మలేరియా కారక దోమలు ఇంటి పరిసర ప్రాంతాల్లోనే కొబ్బరి బొండాలు, టైర్లలో వృద్ధి చెందుతాయని చెప్పారు. ఇళ్లల్లో ఫ్రిజ్లో కూడా వెనుక భాగంలో ఉన్న నీటిలో దోమల ఉత్పత్తి జరుగుతుందన్నారు. వీటి నివారణపై అవగాహన పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్వో రమేష్,ఆర్ ఐ అహ్మద్ పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలోని ధోనుబాయి, కుసిమి, మర్రిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మలేరియా సబ్ యూనిట్ అధికారి జె.మోహన్‌రావు ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సిబ్బంది ద్వారా ర్యాలీ నిర్వహించారు. ముందుగా దోమలు కనిపెట్టిన రాబర్ట్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. దోమలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సాలూరు : మాట్లాడుతున్న మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ పకీరురాజు

వీరఘట్టం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో వైద్య అధికారులు జి.ప్రదీప్ కుమార్, ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. దోమల వల్ల ప్రజల అవగాహన పెంపొందించుకోవాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీల పెంపునకు నిరసనగా సంతకాల సేకరణ

ప్రజాశక్తి - పాలకొండరూరల్

విద్యుత్ ఛార్జీల పెంపునకు నిరసనగా ఈనెల 30, 31 కరపత్రం ప్రచారం, సంతకాలు సేకరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు పిలుపునిచ్చారు. ఆదివారం సిపిఎం పాలకొండ మండల కమిటీ సమావేశంలో తిరుపతిరావు మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీల పెంపుదలకు నిరసనగా ఆగస్టు 30, 31 కరపత్రం ప్రచారం, సంతకాలు సేకరించాలని, సెప్టెంబర్ 1న సచివాలయల వద్ద ప్రజలతో నిరసన, వినతులు ఇవ్వాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగ సమస్యపై రౌండ్ టేబుల్ సమావేశాలు, సదస్సులు, నిరసన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. సమావేశంలో సిపిఎం పాలకొండ మండల కమిటీ కన్వీనర్ డి.రమణారావు, దూసి దుర్గారావు, అర్తముడి లక్ష్మణరావు, జి.సారిక తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో ఎగువదారబందం గిరిజన గ్రామం ప్రజలు శ్రమదానంతో రహదారి వేసుకోవడం గిరిజనులు పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యానికి నిదర్శనమని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు విమర్శించారు. ఐటిడిఎ ఏర్పడి 3 దశబ్దాలు గడిచినా ఇంకా అనేక గ్రామాలకు రోడ్లు లేకపోవడం దారుణమన్నారు. పంచాయతీ రాజ్ అధికారుల సరైన పర్యవేక్షణ లేని కారణంగా వేసిన రోడ్లు కూడా నాణ్యత ఉండడంలేదన్నారు. వెంటనే గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని పెద్దగెడ్డ జలాశయంలో చేపల వేటకు వెళ్లి మృతి చెందిన పుంగారి సీతారాం కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలి పెద్దగడ్డ జలాశయం నిర్వాసితుల సంఘం నాయకులు కోరాడ ఈశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా కేసలి రిజర్వాయర్ వద్ద బాధితులు లక్ష్మి తమ నలుగురు పిల్లలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. నిర్వాసిత గ్రామమైన ఎర్రడ్లవలసకు చెందిన సీతారాం రెండు నెలల కిందట చాపల వేటకు వెళ్లి పెద్దగడ్డ జలాశయంలో పడి మృతి చెందాడన్నారు. దీంతో ఆయన భార్య లక్ష్మి, తన నలుగురు పిల్లలతో కేసలికి చెందిన వారి అమ్మ ఇంట్లో ఉంటుందన్నారు. ఆమె తండ్రి మృతితో ఎటువంటి ఉపాధి లేక తీవ్రమైన ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఏర్పడిందని అన్నారు పెద్ద గడ్డ జలాశయంలో సర్వం కోల్పోయి ఎటువంటి ఉపాధి అవకాశం లేకుండా భర్త మృతి చెందడంతో తాను రోడ్డు పాలయ్యానని లక్ష్మి ఆవేదన వ్యక్తం చేసింది. ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పించి, తన నలుగురు పిల్లలకు జీవనోపాధి కల్పించాలని, ఔట్సోర్సింగ్ ఉద్యోగం ఎక్కడైనా ఇప్పించి తమకు ఆదుకోవాలని ఐటిడిఎ పిఒను, కలెక్టర్‌ను కోరారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పాలకొండ

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాలా రమణారావు అన్నారు. ఆదివారం ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో పాలకొండ మండలంలో పనిచేస్తున్న వర్కర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలను, కళాశాలను పరిశుభ్రంగా ఉంచే శానిటేషన్ (ఆయా) వర్కర్లు అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారు. చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించలేక చాలా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు అమలు చేయాలని, ప్రతి నెలా 5లోపు వేతనాలు చెల్లించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, శానిటేషన్ పరికరాలు ప్రభుత్వమే సరఫరా చేయాలని, ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలని, సంవత్సరానికి రెండు జతలు యూనిఫాంలు ఇవ్వాలని, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, శానిటేషన్ కార్మికులందర్నీ నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఈ దిగువ తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాల కళాశాల శానిటేషన్ వర్కర్స్ యూనియన్(సిఐటియు) సభ్యులుగా చేరాలని తీర్మానించారు. అనంతరం నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నిరసన తెలుపుతున్న పాఠశాలల పారిశుధ్య కార్మికులు

అధ్యక్షులుగా బి.చిన్నముడు, ప్రధాన కార్యదర్శిగా పి.జ్యోతి, వైస్ ప్రెసిడెంట్ గా కె.రజిని, కార్యదర్శిగా పి.గౌరి, కోశాధికారిగా బి.గౌరీ, కార్యవర్గ సభ్యులుగా డి.నరసమ్మ, టి.ధనలక్ష్మి, డి.కుమారి తదితరులతో పాటు సిఐటియు మండల సమన్వయ కమిటీ కార్యదర్శి కాద రాము గౌరవ అధ్యక్షులుగా ఎన్నుకోబడ్డారు.

భవిష్యత్తుకు గ్యారెంటీ మహాశక్తియాత్ర

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

పాలకొండ నియోజకవర్గం ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో పాలకొండ టౌన్ పరిధిలో భవిష్యత్తుకు గ్యారెంటీ మహాశక్తియాత్ర కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జయకృష్ణ మాట్లాడుతూ మహిళలకు భద్రత అయిన భరోసా అయినా ఆర్థిక అండగా ఇవ్వగల ఏకైక నాయకుడు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వల్లే సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకొండ పార్టీ అధ్యక్షులు గంట సంతోష్, అడపా బాబ్జీ, అంపోలు శ్రీను, వండన సంతు, సారిపిల్లి సంతోష్ కుమార్, కాశిం, బెజ్జిపురం శ్రీరాములు, లక్ష్మి, పార్వతి, భవాని, ఈశ్వరమ్మ, రాజేశ్వరి, టౌన్ ముఖ్య నాయకులు, స్థానిక మహిళా నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పాలకొండలో ప్రచారం చేస్తున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జి జయకృష్ణ

మొగదారిగూడలో...

సీతంపేట : గిరిజనుల భవిష్యత్తు బాగుండాలంటే టిడిపి పాలన రావల్సిందేనని పాలకొండ నియోజకవర్గ టిడిపి నాయకులు పడాల భూదేవి అన్నారు. మండలంలోని మొగదారిగూడలో ఆదివారం భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో భవిష్యత్తుకు గ్యారెంటీ, మహాశక్తిపై అవగాహన కల్పించారు. 2024లో టిడిపికే పట్టం కట్టాలని కోరారు. మినీ మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాలు గూర్చి వివరించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి ఆరిక లచ్చుమయ్య, స్థానిక వార్డుమెంబర్ సవర బంగారయ్య, సవర మోహన్‌పాల్, సవర కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : మొగదారిగూడలో లో ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు భూదేవి

కుమ్మరి గండిలో...

మండలంలోని కుమ్మరిగండి పంచాయతీ పరిధిలో రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి బిడ్డిక చంద్రరావు ఆధ్వర్యంలో మహాశక్తియాత్ర ప్రచారకర్త తోయక సంధ్యారాణి ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె కుమ్మరిగండి పంచాయతీ పరిధిలో గల గ్రామాల్లో పర్యటించి ప్రజల కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ పరిధిలో ఉన్న సమస్యలను భవిష్యత్తులో తెలుగుదేశం ప్రభుత్వం వస్తే పరిష్కారమవుతాయన్నారు. కావున నిమ్మక జయకృష్ణను గెలిపించుకుంటేనే మన సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని అన్నారు. కార్యక్రమంలో తోయిక సంతు, వరలక్ష్మి, సవర సూర్యం, సవర సంతు, సవర మోహన్, సవర తిక్కమ్మ, సరోజిని, అప్పలమ్మ, సుండమ్మి, సుందరి, మంగమ్మ, చంద్రమ్మ, మల్లమ్మ, పార్వతి, పలువురు మహిళలు పాల్గొన్నారు.

విజిలెన్స్ దాడులపై గోప్యత ఎందుకో?

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని కొన్ని కిరాణా షాపులపై శుక్రవారం సాయంత్రం విజిలెన్స్ అధికారులు నిర్వహించిన దాడులపై గోప్యత పాటించినట్లు తెలుస్తోంది. శివాజీ బొమ్మ జంక్షన్, వేదసమాజం సెంటర్‌లో వున్న మూడు హోల్ సేల్ దుకాణాలపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నకిలీ వస్తువు ల విక్రయాలు చేస్తున్నారనే విషయాన్ని అధికారులు నిర్ధారించారు. దీనిపై షాపు యజమానులపై కేసులు నమోదు చేసి జరిమానా విధించినట్లు తెలుస్తోంది. దాడుల విషయం గోప్యంగా ఉంచడం వెనుక కారణాలు తెలియడం లేదు.

రాజీవ్‌గాంధీకి నివాళ్లు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాజీవ్ గాంధీకి నివాళి

ప్రజాశక్తి - సాలూరు

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆదివారం పట్టణం కాంగ్రెస్ అధ్యక్షులు సిగడాపు బంగారయ్య ఆధ్వర్యాన పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు ద్వారపురెడ్డి పుండరీకాక్ష నాయుడు నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. దేశం కోసం ప్రాణాలు తృణప్రాయంగా అర్పించిన ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ ఆశయాలను యువత ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు.

వైద్య శిబిరాలు నిర్వహించాలి

ప్రజాశక్తి - బెలగాం

గ్రామాల్లోనూ, వార్డుల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని జనసేన నాయకులు జిల్లా వైద్యాధికారులను డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక విలేకరులతో జనసేన నాయకులు వంగల దాలి నాయుడు, అన్నాబత్తుల దుర్గాప్రసాద్, కర్రి మణి మాట్లాడుతూ ఇటీవల జిల్లాలో కురిసిన వర్షాలకు గాను జిల్లాలో వైరల్, మలేరియా, డెంగీ తదితర జ్వరాలు విజృంభిస్తున్నాయన్నారు. కావున జిల్లా యంత్రాంగం అప్రమత్తమై జిల్లాలోని అన్ని గ్రామాల్లో, మున్సిపాల్టీలోనూ, వార్డుల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని కోరారు. అలాగే దోమలు పెరుగుదలకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టి దోమల నివారణకు రసాయనాల పిచికారీ, ఫాగింగ్ చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో, పిహెచ్‌సిల్లో, అర్బన్ హెల్త్ సెంటర్లలో, జిల్లా ఆస్పత్రిలో వైద్యులు వైద్య సిబ్బంది అన్నివేళల్లో అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు.

అంతర పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రజాశక్తి - పాచిపెంట

ప్రకృతి వ్యవసాయ రాష్ట్ర రిసోర్స్ పర్సన్ కె.ప్రకాష్ ఆదివారం అమ్మవలసలో పొలంబడి, ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయంలో అంతర పంటలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ కంచెపంటల ద్వారా రైతులకు అదనపు ఆదాయం వచ్చేలా ప్రోత్సహించాలని ప్రకృతి వ్యవసాయ క్యాడర్‌ను ఆదేశించారు. అంతేకాకుండా వ్యవసాయశాఖతో సమన్వయం చేసుకొని ప్రకృతి వ్యవసాయాన్ని రైతు ముంగిటకు తీసుకెళ్లాలని సూచించారు. పాంచాలిలో ప్రయోగాత్మక ఎటిఎం మోడల్ కూరగాయల క్షేత్రాన్ని పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా రైతులకు ఏడాది పాటు ఆదాయం వచ్చేలా జీవ వైవిధ్యాన్ని పెంపొందింపజేసే కూరగాయల ఎటిఎం నమూనా క్షేత్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. తక్కువ స్థలంలో ఎక్కువ ఆదాయం వచ్చేలా వంగ బెండ టమోటా ఆకుకూరలు, కూరపాదులు మిరప వంటి రకాలను తక్కువ స్థలంలో ఎక్కువగా సేంద్రియ వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తూ భూమి లోపల బయట కూడా జీవ వైవిధ్యాన్ని పెంచేలా రైతుకు ఎక్కువ ఆదాయం వచ్చేలా ఈ ఏటీఎం మోడల్ ఉపయోగపడుతుందని తెలిపారు.

రాష్ట్ర రిసోర్స్‌పర్సన్ కె.ప్రకాశ్

రైతులకు సూచనలు ఇస్తున్న రాష్ట్ర రిసోర్స్ పర్సన్ ప్రకాష్

ప్రయోగాత్మకంగా పాచిపెంట మండలంలో రైతుల కోసం ఈ క్షేత్రం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మెంటార్ యశోదమ్మ, సిఆర్‌పి తిరుపతి నాయుడు, బాలకృష్ణ, ఐసిఆర్పి రమణ పాల్గొన్నారు

ఆంధ్రా రోడ్లకు ఒడిశా లారీ అసోసియేషన్ మరమ్మతులు

ప్రజాశక్తి - కొమరాడ

ఆంధ్రా - ఒడిస్సా సరిహద్దు ప్రాంతమైన కూనేరు వద్ద అంతర రాష్ట్ర రహదారి భారీ గోతులు ఏర్పడ్డాయి. గోతులు భారీగా ఏర్పడినప్పటికీ ఆర్అండ్‌బి అధికారులు పట్టించుకోకపోవడంతో ఒడిశా లారీ అసోసియేషన్ సభ్యులు స్పందించి గోతులు కప్పారు. అంతరాష్ట్ర రహదారిపై గల అటు ఒడిస్సా, ఇటు ఆంధ్రా సరిహద్దు గల కూనేరులో పెద్ద పెద్ద గోతులను ఒడిశా లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మూడు లారీలతో చిన్న చిప్స్ తెచ్చి పూర్తిగా కప్పి వేయడం జరిగింది. గడిచిన రెండు నెలలుగా ఈ రహదారిపై పెద్ద గోతులు ఏర్పడడంతో ప్రతిరోజూ వాహనాలు ఆ గుమ్ములో దిగిపోవడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అవుతుండేది. ఎక్కడైతే వాహనాలు భారీగా ట్రాఫిక్ జామ్ అవుతుందో అక్కడికి వెంటనే పోలీస్ సిబ్బంది స్పందించి ట్రాఫిక్‌ను మళ్లించేవారు. అయితే ఆర్అండ్‌బి అధికారులు స్పందించకపోవడం దురదృష్టకరమని వాహనచోదకులు విమర్శిస్తున్నారు. ఎక్కడైతే నిరసన తెలియజేస్తే అక్కడ కప్పుతున్నారు తప్ప పూర్తిస్థాయిలో ఎక్కడా ఈ గోతులు కప్పడంలేదు. దీంతో ప్రతిరోజు వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే ఆ గోతుల్లో చిన్న చిన్న వాహనదారులు పడి క్షతగాత్రులవుతున్నారు. దీంతో ఆలోచించిన ఒడిశాలోని రాయగడ లారీ అసోసియానికి చెందిన సూర్యకోట, జానకి రామ్మూర్తి, డి.భాస్కరరావు, ప్రసాద్, పడాల రాజేష్, పసుపురెడ్డి రవి, చిరంజీవి, మరి కొంతమంది నాయకులు కలిసి ఈ గోతులు పూడ్చారు. ఈ సందర్భంగా వారిని స్థానిక ప్రజలు, వాహనచోదకులు అభినందించారు.

జెసిబితో పూడ్చుతున్న గొయ్యిలు

తోటపల్లి దేవాలయం బోర్డు డైరెక్టర్‌కు పౌర సన్మానం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పార్టీని నమ్ముకుని కిందిస్థాయి నుంచి వచ్చిన వ్యక్తులను పార్టీ ఎల్లప్పుడు గుర్తించుకుంటుందని వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు అన్నారు. ఇందులో భాగంగానే చినమేరంగికి చెందిన పాత్రోను తోటపల్లి దేవస్థానం బోర్డ్ డైరెక్టర్ పదవి వరించిందదన్నారు. ఆదివారం గుమ్మలక్ష్మీపురంలో ఏర్పాటు చేసిన పాత్రో పౌరసన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. వైసిపికి కంచుకోటగా గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీ ఉందని, అందుకే గుమ్మలక్ష్మీపురం ప్రజలు పాత్రో సేవలను గుర్తించి పౌర సన్మానం ఏర్పాటు చేయడం ఎంతో అభినందించదగ్గ విషయమని అన్నారు. అనంతరం పలువురు పాత్రోను అభినందించి శాలువలతో సత్కరించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి కే. దీనమయ్య, వైస్ ఎంపిపిలు ఎన్. శేఖర్, లక్ష్మణరావు, బిసి రజక కార్పొరేషన్ డైరెక్టర్ జి.గిరిబాబు, వర్తక, వైశ్య సంఘం అధ్యక్షులు జి.హరిప్రసాదరావు, కొత్తకోట విష్ణుప్రసాద్, అరకు ఎస్టీ సెల్ ప్రతినిధి నిమ్మక గోపాల్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు వహీద్ ఖాన్, వైసిపి నాయకులు ఎన్.నాగేశ్వరరావు, దొరబాబు తదితరులు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలోని లోతుగెడ్డకు చెందిన ఎలిగాపు నాగరాజు(22) అనుమానస్పద స్థితిలో మృతి చెందాడు. ఆండ్ర జలాశయంలో ఆదివారం నాగరాజు మృతదేహం లభ్యమైంది. కుటుంబ సభ్యులు, పోలీసులు వివరాలు ప్రకారం.. నాగరాజు జెసిబి ఆపరేటర్‌గా విశాఖలో పరిసర ప్రాంతాల్లో పనిచేస్తున్నాడు. కొద్ది రోజులు క్రితం లోతుగెడ్డ స్వగ్రామం వచ్చాడు. శనివారం ఉదయం 6గంటల సమయంలో స్నేహితులతో కలిసి కాలకృత్యాలు తీర్చుకొనేందుకు ఆండ్ర జలాశయం వైపునకు వెళ్లాడు. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. జలాశయం గట్టుపై నాగరాజు బట్టలు, చెప్పులు వుండడం గమనించిన నాగరాజు తల్లి రామలక్ష్మి ఆండ్ర పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

టెన్త్, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలు ప్రారంభమయ్యాయని స్థానిక శ్రీ సాయి నికేతన్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు రొంపిల్లి ఉదయకిరణ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించనున్న పదవ తరగతి, ఇంటర్ కోర్సులకు సంబంధించిన బ్రోచర్‌ను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ మధ్యలో చదువు మానేసిన వారు, వ్యాపార రంగాల్లో ఉన్నవారికి, ఉద్యోగులకు, ప్రజాప్రతినిధులకు, వివిధ సంఘాల సభ్యులకు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి సువర్ణ అవకాశమని పేర్కొన్నారు. ఈ మేరకు అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, గ్రామసచివాలయ సిబ్బంది, తదితరులు టెన్త్ ఇంటర్మీడియట్ కోర్సుల్లో నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీ సాయినికేతన్ హై స్కూల్ యాజమాన్య ప్రతినిధులు పెద్దిరెడ్డి శ్రీనివాసరావు నాయుడు, పెద్దింటి శ్రీధర్ పక్కి. సదాశివరావు, చిగురువలస లీలాప్రసాద్, ఉపాధ్యాయులు బొంతాడ సత్యనారాయణ, ఇజ్జురోతు తాతినాయుడు, చందక అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బ్రోచర్‌ను విడుదల చేస్తున్న సాయినికేతన్ హైస్కూల్ హెచ్‌ఎం, ఉపాధ్యాయులు